శరవేగంగా రైల్వే డబ్లింగ్ పనులు 2






ఎరువుల ధరలను తగ్గించాలి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## డిచ్‌పల్లి డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం..

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాంమోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 16 తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



## ఆర్టీసీ ఆర్ఎంగా ఎస్పీజీకే మూర్తి బాధ్యతల స్వీకరణ



**అక్షరటుడే, ఇందూరు:** ఆర్టీసీ ఆర్ఎంగా ఎస్పీజీకే మూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లాకు విచ్చేసిన ఆయనకు ఆర్టీసీ డీఆర్ఎం, డీఎంలు, ఉద్యోగులు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్ఎం మూర్తి కార్యాలయంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్, డిపో మేనేజర్లు, సూపరింటెండెంట్లు, రీజియన్ కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో కొత్త బస్సు మార్గాల అవసరం, గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ప్రజారవాణా సౌకర్యాల విస్తరణ, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల, విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులకు మరింత మెరుగైన బస్సు సేవల కల్పన వంటి అంశాలపై చర్చించారు. జిల్లా ప్రజలకు సురక్షితమైన, సమయపాలనతో కూడిన, నాణ్యమైన రవాణా సేవలను అందించేందుకు టీజీఎస్ఆర్టీసీ కట్టుబడి ఉందన్నారు.




## హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనులకు కౌన్సిల్ ఆమోదం

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చిన ఎస్ఆర్ ఫౌండేషన్‌కు పనులు అప్పగించడానికి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అధ్యక్షతన గురువారం సాధారణ సమావేశం నిర్వహించారు. హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనులపై చర్చించేలా ఏకైక అజెండాతో సమావేశం సాగింది. సమావేశంలో శ్మశాన వాటిక నిర్మాణ పనులను ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా చేపట్టే ప్రతిపాదనపై సభ్యులు చర్చించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, సదరు నిర్మాణ పనులను ఎస్ఆర్ ఫౌండేషన్‌కు అప్పగించేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ నిర్ణయంతో హిందూ శ్మశాన వాటిక నిర్మాణ పనులకు మార్గం సుగమమైందని, పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని సమావేశ వర్గాలు తెలిపాయి. శ్మశాన వాటిక అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ ఎన్‌వై గిరి, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, వైస్ ఛైర్మన్ కాసర్ల గోదావరి, మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.




# 'కార్పొరేట్' అడ్మిషన్లు

**నిజామాబాద్ జిల్లాలో కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభానికి మరికొద్ది రోజులు మాత్రమే ఉంది. హైదరాబాద్‌లోని తమ కార్పొరేట్ బ్రాంచ్‌ల పేరిట స్థానికంగా భవనాలు నెలకొల్పి అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్నాయి.**

**- అక్షరటుడే, ఇందూరు**

**■ నగర శివారలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న స్కూళ్లు ■ సీజ్‌నకు డీఈవో ఆదేశాలు**

జిల్లాలో వందల సంఖ్యలో పాఠశాలలు ఉన్నాయి. కొన్ని పాఠశాలలు అనుమతులు తీసుకుంటున్నా.. మరికొన్ని అవేమీ లేకుండానే అడ్మిషన్లు చేపడుతున్నాయి. నగర శివార్లలో కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల పేరిట స్కూళ్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే వీటిలో కొన్నింటికి అనుమతులు లేవు. అయినా కూడా యథేచ్ఛగా అడ్మిషన్లు తీసుకుంటున్నాయి. పరిష్మన్ లేకుండా ఒక పాఠశాలలో ఒక్కో అడ్మిషన్ కోసం రూ. 1.80 లక్షలు వసూలు చేస్తున్నారు. సదరు పాఠశాలపై విద్యార్థి సంఘాలు డీఈవోకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జీవో ms no 1 ప్రకారం గుర్తింపు లేకుండా అడ్మిషన్లు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదు. కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యారు.

### నిబంధనలు బేఖాతర్

ప్రైవేటు స్కూల్ ఏర్పాటు చేయాలంటే విద్యాశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. నూతన పాఠశాల ఏర్పాటుతో పాటు రెన్యూవల్ కోసం అక్టోబర్‌లోనే చలాన్ కట్టాల్సి ఉంటుంది. అయితే ఇప్పటి వరకు కొన్ని స్కూళ్లు ఇంకా చలాన్ కూడా కట్టలేదు. కనీస నిబంధనలు పాటించకుండానే జోరుగా అడ్మిషన్లు తీసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు పెద్దపెద్ద హోర్డింగ్‌లు, అడ్వర్టైజ్‌మెంట్లు ఇస్తున్నారు. వీటిని చూసి విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోతూ పాఠశాలలకు గుర్తింపు లేదనే విషయం తెలుసుకోకుండానే తమ పిల్లలను చేర్పిస్తున్నారు.

### ఆందోళనకు సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాలు

జిల్లాలో పర్మిషన్లు లేకుండా ఏర్పాటవుతున్న కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల విషయంలో విద్యార్థి సంఘాలు ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి. ఓ విద్యా సంస్థ అమనుతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతుండడంతో ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే ప్రైవేటు స్కూళ్లలో పుస్తకాలు, నోటుబుక్కుల అమ్మకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపడుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని చెబుతున్నారు.

### ప్రకటనలకే పరిమితం

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ బుధవారం ప్రకటన విడుదల చేసింది. జిల్లాలో కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వ గుర్తింపు పొందకుండానే కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరిట ప్రవేశాలు పొందుతున్నాయని పేర్కొంది. సదరు పాఠశాలలు కనీసం ప్రభుత్వ గుర్తింపు కోసం ప్రపోజల్స్ సమర్పించలేదని తెలిపింది. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఎలాంటి నోటీసు లేకుండా మూసివేయాలని ఆదేశాలు ఇచ్చింది. అంతేకాకుండా పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నోట్ బుక్స్, యూనిఫారం, షూస్, ఇతర స్టేషనరీ అమ్మకాలు చేపట్టకూడదని స్పష్టం చేసింది.

## నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ పీవీ రాజేశ్వర్‌రావు అన్నారు. విద్యుత్ సంస్థ సీఎండీ వరుణ్ రెడ్డి ఆదేశాల మేరకు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచారు. ఈ నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు డీఈ ఇమ్మాన్యుయేల్ వెంకటరమణ,ఏడీఈలు చంద్రశేఖర్, నటరాజ్, తోట రాజశేఖర్, వినోద్, ఏఈలు నగేష్, జాకీర్ అలీ, సాయిలు, శ్రీనివాస్, ఫోర్‌మెన్ గ్రేడ్ 1 జైసింగ్, సిబ్బంది పాల్గొన్నారు.





## పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటా..

**అక్షరటుడే, కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. షబ్బీర్‌అలీపై చేసిన వ్యాఖ్యలపై ఈనెల 11లోపు సంజాయిషీ ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు ఆయన గురువారం స్వయంగా కమిటీ వైస్ ఛైర్మన్ శ్యాం మోహన్‌ను కలిసి సంజాయిషీ ఇచ్చారు. కమిటీ అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అయితే కామారెడ్డిలో హిందూశ్మశాన వాటిక అంశంపై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై షబ్బీర్‌అలీ వర్గం ఆయనపై క్రమశిక్షణ కమిటీకి గత నెల 31న ఫిర్యాదు చేశారు. దాంతో చంద్రశేఖర్ రెడ్డికి ఈ నెల 4న కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. పార్టీ సీనియర్ నేతపై చేసిన వ్యాఖ్యలు, ఇతర అంశాలపై 11లోగా వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొంది.



## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణలో బీజేపీ కుట్ర

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి నామినేషన్ వేసిన మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణలో బీజేపీ కుట్ర ఉందని మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. సంబంధం లేని కేసును సాకుగా చూపి ఆమె నామినేషన్‌ను తిరస్కరించడంపై తీవ్రంగా మండిపడ్డారు. విద్యావేత్త, మచ్చలేని నాయకురాలిగా, గాంధీయ వాదిగా ప్రజలకు సేవ చేస్తూ రాజకీయాల్లో కొనసాగుతున్న ఆమెపై మోదీ ప్రభుత్వం కుట్రపూరిత చర్యకు పూనుకుందని ఆరోపించారు. ఆమె నామినేషన్ తిరస్కరించడం సిగ్గుచేటన్నారు. దీనిపై సత్వరం ఎలక్షన్ కమిషనర్ చొరవ తీసుకొని ఆమెకు న్యాయం చేయాలని కోరారు.

## యూరియా బుకింగ్ యాప్‌లో మార్పులు తేవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్‌లో చాలా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ లో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. దినేష్ కులాచారి మాట్లాడుతూ బుకింగ్ యాప్‌లో మండల స్థాయిని ప్రామాణికంగా తీసుకోవడం ద్వారా రైతులకు అనేక ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. స్థానిక సొసైటీలు, ఫర్టిలైజర్ షాపులను అందుబాటులోకి తీసుకువస్తే యాప్‌లో యూరియాను బుకింగ్ చేసుకోవడం సులభతరం అవుతుందన్నారు. మండల కేంద్రం లేదా యాప్‌లో సూచించిన పంపిణీ కేంద్రాలు అనేక గ్రామాలకు దూరంగా ఉన్నాయన్నారు. దీంతో బుక్ చేసుకున్న అనంతరం యూరియా బస్తాల కోసం రైతులు ఇతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతులపై అదనపు రవాణా చార్జీలు కూడా పడుతున్నాయని వ్యయప్రయాసలకు గురవుతున్నారని వాపోయారు. ఈ సమస్య పరిష్కారానికి యాప్‌లో మండల యూనిట్‌కు బదులుగా రైతులకు అత్యంత చేరువలో ఉండే ప్యాక్స్, ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫర్టిలైజర్ దుకాణాలను చేర్చాలని ఆయన కోరారు. ప్రస్తుత సీజన్‌కు సంబంధించి జిల్లాలో రైతులు ఇప్పటికే వరినట్లు వేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారని దినేష్ తెలియజేశారు. కానీ ఇప్పటివరకు ఒక ఎకరానికి ఎన్ని బస్తాల యూరియా కేటాయిస్తారనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదన్నారు. దీంతో రైతాంగంలో తీవ్ర అయోమయానికి రైతాంగం అయోమయానికి గురవుతుందని ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇస్తే రైతులు దానికి అనుగుణంగా ప్రణాళికలు తయారు చేసుకుంటారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం యూరియా కేటాయింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలదే పైచేయి

**అక్షరటుడే, ఇందూరు:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లోనూ బాలికలే పైచేయి సాధించారు. 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను బోర్డు గురువారం విడుదల చేసింది. ఈ వివరాలను నిజామాబాద్ డీఐఈవో రవికుమార్ వెల్లడించారు. నిజామాబాద్ జిల్లాలో ఫస్టియర్ జనరల్ విద్యార్థినులు 5,241 మంది పరీక్షలకు హాజరు కాగా 3,839 మంది పాసై 73.25 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే జనరల్ ఫస్టియర్ బాలురు 4,908 మంది హాజరు కాగా 2,687 మంది విద్యార్థులు పాసై 54.77 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం జనరల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 10,147 మంది హాజరు కాగా 6,526 మంది పాసై 64.31 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఫస్టియర్ వొకేషనల్ బాలికలు 329 మంది పరీక్షలు హాజరుకాగా 257 మంది పాసయ్యారు. మొదటి సంవత్సరం ఒకేషనల్ బాలురు 960 మంది పరీక్షలకు హాజరై 679 మంది ఉత్తీర్ణత పొందారు. మొత్తం ఒకేషనల్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1,289 మంది పరీక్షలకు హాజరు కాగా 931 మంది పాసై 72.61 శాతం పాసయ్యారు.

### సెకండియర్‌లో..

అలాగే రెండో సంవత్సరం జనరల్ బాలికలు 2,066 పరీక్షలకు హాజరు కాగా 1,204 పాసై 58.28 శాతం ఉత్తీర్ణత సాధించారని డీఐఈవో తెలియజేశారు. అలాగే జనరల్ సెకండియర్ బాలురు 3,470 మంది పరీక్షలకు హాజరు కాగా 1,896 మంది పాసై 54.84 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం సెకండియర్ జనరల్ విద్యార్థులు 5,536 మంది పరీక్షలకు హాజరు కాగా 3,100 మంది విద్యార్థులు పాసై 56శాతం పాస్ అయ్యారు. వొకేషనల్ సెకండియర్‌లో బాలికలు 162 మంది పరీక్షలకు హాజరుకాగా 106 మంది పాసై 65.43 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఒకేషనల్ సకండ్ ఇయర్ బాలురు 771 మంది పరీక్షలు రాయగా 420 మంది పాస్ అయ్యారు. మొత్తం ఒకేషనల్ 933 మంది రెండో సంవత్సరం విద్యార్థులు పరీక్షలకు హాజరై 526 మంది పాస్ కాగా 56.38 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు.

## మారుమూల పల్లెలకూ ఆర్టీసీ సేవలను విస్తరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులకు, ప్రజలకు, రైతులకు రవాణా వసతి మెరుగుపర్చేందుకు వీలుగా మారుమూల ప్రాంతాలకు సైతం ఆర్టీసీ సేవలను విస్తరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లో ఆర్టీసీ సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండడం లేదని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం.. గ్రామాలకు బస్సులు రావాలని వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలో ఆర్టీసీ బస్సు సర్వీసులు అవసరమైన మారుమూల గ్రామాలు, తండాల వివరాలను ఎంపీవోల ద్వారా సేకరించి, ఆ జాబితాను ఆర్టీసీ అధికారులకు అందజేయించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల రాకపోకలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపడం వల్ల అటు ప్రజలకు రవాణా సౌలభ్యం ఏర్పడడంతో పాటు ఆర్టీసీ సంస్థకు కూడా తగిన ఆదాయం సమకూరుతుందని ప్రస్తుతం పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని.. ఖరీఫ్ సీజన్ పంటలు విత్తుకునేందుకు రైతులు ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కోసం రాకపోకలు సాగిస్తారన్నారు. ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం రవాణా వసతిపై ఆధారపడతారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా నివాస ప్రాంతాలు, మారుమూల గ్రామాలకు కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని, అవసరమైన చోట ప్రయాణికులు, ప్రజల రద్దీని బట్టి బస్సు ట్రిప్‌ల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎంపీవోల ప్రతిపాదించిన జాబితాను పరిశీలించి, అవసరం ఉన్న అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఆర్టీసీ ఆర్ఎం మూర్తి, డిప్యూటి ఆర్ఎం మధుసూదన్, డిపో1 మేనేజర్ ఆనంద్, అన్ని మండలాల ఎంపీవోలు పాల్గొన్నారు.

2 | నిజామాబాద్/కామారెడ్డి | గురువారం | 11.6.2026

www.aksharatoday.in

AKSHARA TODAY


## విద్యార్థి సంఘాల ఆగడాలను అరికట్టాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో విద్యార్థి సంఘాల దౌర్జన్యాలను అరికట్టాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా) ప్రతినిధులు కోరారు. ఈ మేరకు అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాష్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో 'నో ప్రాఫిట్ నో లాస్' కింద పుస్తకాలు విక్రయించుకోవచ్చని కోర్టు ద్వారా ఉత్తర్వులు ఉన్నప్పటికీ కొన్ని విద్యార్థి సంఘాలు పాఠశాలలపై దౌర్జన్యం చేస్తున్నాయన్నారు. పాఠశాలలోకి చొరబడి సామగ్రిని ధ్వంసం చేయడం.. ఉపాధ్యాయులను, మేనేజ్‌మెంట్‌ను బెదిరించడం ద్వారా ఇబ్బందులను కలగజేస్తున్నాయన్నారు. మండల స్థాయిలో సమస్యలు ఉంటే ఎంఈవోకు అలాగే జిల్లాస్థాయిలో ప్రైవేట్ పాఠశాలల్లో ఇబ్బందులు ఉంటే డీఈవోకు ఫిర్యాదు చేయాల్సి ఉండగా నేరుగా విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాలలపైకి దాడికి రావడం ఎంత వరకు సమంజసమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా ప్రతినిధులు జయసింహా గౌడ్, సంజీవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల ధరలను తగ్గించాలి




**అక్షరటుడే, నందిపేట్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని అఖిల భారత రైతు సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నందిపేట్ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యూరియా డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మార్కెట్‌లో పెరిగిన ధరలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కేంద్రం కనీస మద్దతు ధర నిర్ణయించలేదని.. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నాడని వివరించారు. రైతుల రుణాలను మాఫీ చేయాలని.. భారత్ అమెరికా వాణిజ్యం ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్న మల్లయ్య, కే గంగాధర్, రాజలింగం, దేవన్న, మంజరి గంగన్న పాల్గొన్నారు.



## పాఠశాలల్లో ఫీజు రాయితీ కల్పించాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలోని అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలలో వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) అధికారులను కోరింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. జిల్లాలో 500 పైగా అర్హులైన జర్నలిస్టులు ఉన్నారని, వీరిలో పేద, మధ్యతరగతికి చెందిన వారే ఎక్కువగా ఉన్నారన్నారు. వారి పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో వందశాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్, ఆబిద్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు శ్రీనివాస్, జర్నలిస్టులు శివ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, ముదాం శంకర్, వెంకటేశ్వర్లు, మాణిక్య శ్రీకాంత్, మధు, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ద కాలంగా ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మేడ్చల్ – ముథ్కేడ్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్ట్ పనులు వేగంగా సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నాలుగున్నరేళ్ల క్రితం మేడ్చల్ – ముథ్కేడ్, మహబూబ్‌నగర్ – డోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులకు కలిపి నిధులు విడుదల చేసింది. అయితే గతేడాది ప్రారంభమైన పనులు ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా పరిధిలో వేగంగా సాగుతున్నాయి.
– అక్షరటుడే, డిచ్‌పల్లి



# శరవేగంగా రైల్వే డబ్లింగ్ పనులు

- మేడ్చల్ నుంచి ముథ్కేడ్ వరకు ప్రాజెక్ట్
- నిజామాబాద్ మార్గంలో వేగంగా పనులు
- దశాబ్దాల కల నెరవేరనున్న వేళ

కేంద్ర ప్రభుత్వం మేడ్చల్-ముథ్కేడ్, మహబూబ్‌నగర్-డోన్ రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులకు రూ.5,655.4 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో అత్యధిక భాగం మేడ్చల్-ముథ్కేడ్ మార్గానికే కేటాయించడం విశేషం. నిధుల విడుదల తర్వాత గతేడాది పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా పరిధిలో డబ్లింగ్ పనులు చకచకా జరుగుతున్నాయి.

### ఇందల్వాయి–డిచ్‌పల్లి ప్రాంతాల్లో..

ఇందల్వాయి, డిచ్‌పల్లి ప్రాంతాల్లో ఇప్పటికే ఉన్న రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా మరో లైన్ నిర్మాణం కోసం మట్టి పోసి కంకర చదును చేసే పనులు కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ నుంచి నిజామాబాద్, బాసర, నాందేడ్, షిర్డీ మీదుగా ముంబయి వరకు ప్రయాణించే వేలాది మంది ప్రయాణికులకు ఎంతో మేలు జరుగనుంది.

### రైళ్ల రాకపోకలకు మరింత వేగం

ప్రస్తుతం ఈ మార్గంలో రోజుకు దాదాపు 50 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. దేవగిరి ఎక్స్‌ప్రెస్, అజంతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్, జైపూర్, మధురై, విశాఖపట్నం, సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు ప్యాసింజర్, ఇంటర్‌సిటీ, లోకల్ రైళ్లు కూడా ఇదే మార్గాన్ని వెళ్తున్నాయి. అయితే ఒకే ట్రాక్ ఉండడం వల్ల ఎదురెదురుగా వచ్చే రైళ్లకు మార్గం కల్పించేందుకు అనేక స్టేషన్లలో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా వడియారం, కామారెడ్డి, డిచ్‌పల్లి వంటి స్టేషన్లలో రైళ్లు తరచూ నిలిపివేస్తుంటారు. డబ్లింగ్ పూర్తయితే ఈ సమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కారం లభిస్తుంది. రైళ్లు నిరాటంకంగా నడవడంతో ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా సమయపాలన కూడా మెరుగుపడుతుంది.

### నిజామాబాద్ వ్యాపార రంగానికి ఊతం..

రైల్వే డబ్లింగ్ కేవలం ప్రయాణికులకే కాదు, ప్రాంతీయ అభివృద్ధికి కూడా కీలకంగా మారనుంది. నిజామాబాద్ వ్యవసాయ, వాణిజ్య ఉత్పత్తులు దేశంలోని ఇతర ప్రాంతాలకు వేగంగా చేరే అవకాశం ఉంటుంది. పరిశ్రమలు, గిడ్డంగులు, లాజిస్టిక్స్ రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి. భవిష్యత్తులో మరిన్ని రైళ్లు నడిపేందుకు కూడా ఈ ప్రాజెక్ట్ ఉపయోగపడనుంది. ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయిన విషయం తెలిసిందే. సికింద్రాబాద్ నుంచి మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, నాందేడ్ వరకు విద్యుదీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. దీంతో రైళ్ల నిర్వహణ మరింత సమర్థవంతంగా మారింది. ఇప్పుడు డబ్లింగ్ పనులు కూడా పూర్తయితే ఈ మార్గం తెలంగాణ ఉత్తర ప్రాంతానికి అత్యంత కీలక రైల్వే కారిడార్‌గా మారనుంది.

### ప్రయాణ సమయం తగ్గుతుంది..

చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు గత ఏడాది కార్యరూపం దాల్చడంతో నిజామాబాద్ జిల్లా ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పనులు నిర్ణీత గడువులో పూర్తయితే ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడటమే కాకుండా జిల్లాకు ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూడా కొత్త దిశ లభించనుంది. మేడ్చల్-ముద్ఖేడ్ డబ్లింగ్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఉత్తర తెలంగాణ రైల్వే రవాణా వ్యవస్థలో ఒక కీలక మైలురాయిగా నిలవనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## తెయూలో పోస్టర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** మండలంలోని తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'ఏక్ పేడ్ మా కే నామ్ – షోయింగ్ టూ గ్రోయింగ్ 2026' పోస్టర్లను వీసీ యాదగిరి రావు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అపర్ణ, ప్రోగ్రాం ఆఫీసర్లు స్వామి, శ్రీనివాస్ ఉన్నారు.





## అంకాపూర్‌లో అధ్యాపకుల ప్రచారం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తమ విద్యార్థులను చేర్పించాలని అధ్యాపకులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం వారు ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కళాశాలలో అందిస్తున్న మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్, అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, గంగాధర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల రికవరీ..

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు బాధితులకు బుధవారం ఫోన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో ఐదుగురు బాధితులు తమ ఫోన్లు పోగొట్టుకున్నట్లుగా తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో కేసు నమోదు చేసుకున్న అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇందులో రెండేళ్ల క్రితం ఫోన్లు పోగొట్టుకున్న వాళ్లు కూడా ఉన్నారన్నారు. రికవరీ చేసిన ఫోన్లను బాధితులు షరా బేగం, అమోల్ మాధవ్ బహదూర్, ఎర్ల కుమార్, తెడ్డు ప్రదీప్, పల్లవిలకు అందజేసినట్లు తెలిపారు.

## ముగిసిన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1న ప్రారంభమైన వేసవి కబడ్డీ శిక్షణ శిబిరం జూన్ 10న అట్టహాసంగా ముగిసింది. నెలరోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ శిబిరంలో 28 మంది క్రీడాకారులు పాల్గొని శిక్షణ పొందారు. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్నారై మోతె సూరజ్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, గెలిచిన వారు గర్వపడకూడదని, ఓడిన వారు నిరుత్సాహానికి గురికాకూడదని సూచించారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి, ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ ఛైర్మన్ ఎన్.అంజయ్య, కబడ్డీ కోచ్ సాయిలు, మోతె విఘ్నేష్, గద్దల సాయికుమార్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి..




**అక్షరటుడే, కామారెడ్డి :** ఆన్‌లైన్ బెట్టింగ్ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలని అత్యాశతో అప్పుల ఊబిలో చిక్కుకొని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తాజాగా ఆన్‌లైన్ బెట్టింగ్ మరో వ్యక్తిని బలి తీసుకుంది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని ఎంఆర్ కాలనీకి చెందిన అంకం క్రాంతి కుమార్ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. రూ.12 లక్షల వరకు అప్పు చేశాడు. అప్పుతీర్చే మార్గం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం కామారెడ్డి పట్టణంలోని రామారెడ్డి రోడ్డులోని చర్చి సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు విఘ్నేష్, వినాయక్, కూతురు సంయుక్త ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.


## ఆరె కటిక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నగరంలోని ఆరె కటిక సంఘం ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేశారు. గురువారం సంఘం భవనంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ ఉమారాణి మాట్లాడుతూ.. కుల సంఘాలు విద్యార్థుల ఎదుగుదలకు తోడ్పడాలన్నారు. విద్యార్థుల ప్రతిభను తట్టి లేపడానికి, విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి చేయూత ఇవ్వాలని కోరారు. సభాధ్యక్షుడు డాక్టరు జమాల్‌పూర్ రాజశేఖర్ మాట్లాడుతూ 17ఏళ్లుగా ఆరెకటిక ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరె కటిక సంఘం అధ్యక్షుడు రవీందర్, నగర అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు కరాటే రమేష్, రాజారామ్, యూత్ సభ్యులు రాజు, నవీన్, సంజీవ్, ఆనంద్, అరుణ్, నందు, రవి, రాహుల్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.









## ముగ్గురు పిల్లలతో తల్లి అదృశ్యం..

### విచారణ చేపడుతున్న పోలీసులు

**అక్షరటుడే, కామారెడ్డి:** షాపింగ్ కోసమని పిల్లలతో కలిసి బయలుదేరిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పట్టణ సీఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన యాడారం శ్యామల తన ముగ్గురు పిల్లలు బిందు (17), శివ (13), దివిజ (8)తో కలిసి ఉదయం కామారెడ్డి పట్టణానికి షాపింగ్‌కు వెళ్తున్నామని ఇంటినుంచి బయలు దేరింది. షాపింగ్ పూర్తి చేసుకుని మధ్యాహ్నం 12 గంటలకు పట్టణంలోని తన తమ్ముడి ఇంటికి వెళ్లింది. అనంతరం ఇంటికి వెళ్తామని చెప్పి సాయంత్రం ఆటోలో బస్టాండ్‌కు పిల్లలతో కలిసి బయలు దేరింది. రాత్రి 8 గంటల బసుకు ఇంటికి వస్తున్నానని చెప్పినా.. ముగ్గురు ఇంటికి రాకపోవడంతో భర్త భానుప్రకాశ్ కామారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఏటీఎం కార్డును మార్చేసి రైతును దోచేసిన అగంతకుడు

**అక్షరటుడే, కామారెడ్డి:** ఏటీఎం పిన్ సెట్ చేయడం తెలియక అపరిచిత వ్యక్తిని సాయం అడిగితే.. ఇదే అదనుగా అకౌంట్ ఖాళీ చేసేశాడు. ఈ ఘటన మాచారెడ్డి మండలంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. మాచారెడ్డి ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లచ్చాపేట్ గ్రామానికి చెందిన రైతు ఎర్రోళ్ల నర్సింలు (53)కు మాచారెడ్డి ఎక్స్‌రోడ్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఖాతా ఉంది. కొత్త ఏటీఎం కార్డు కోసం దరఖాస్తు చేయగా గత నెల 26న పోస్టులో కార్డు వచ్చింది. 27న పిన్ సెట్ చేసుకోవడానికి బ్యాంకు పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లారు. పిన్ సెట్ చేయడం రాక అక్కడున్న అపరిచితుడి సాయం కోరి కార్డు ఇచ్చారు. ఆ వ్యక్తి పిన్ సెట్ చేసి కార్డు తిరిగి ఇచ్చాడు. బుధవారం డబ్బులు డ్రా చేయడానికి బ్యాంకుకు వెళ్తే ఖాతాలో బ్యాలెన్స్ లేదని తెలిసింది. స్టేట్‌మెంట్ తీయగా గత నెల 27న ఎల్లారెడ్డిపేట ఎస్‌బీఐ ఏటీఎంలో రూ.10 వేలు చొప్పున 4 సార్లు మొత్తం రూ.40 వేలు, 28న కూకట్‌పల్లి టెంపుల్ బ్రాంచ్ ఏటీఎంలో రూ.9వేలు డ్రా అయినట్లు గుర్తించారు. మొత్తం రూ.49వేలు మోసపూరితంగా డ్రా కాగా.. డబ్బులు డ్రా అయినట్లు ఎలాంటి మెసేజ్ రాలేదని, అందుకే బ్యాంకుకు వెళ్లే వరకు మోసం గురించి తెలియలేదని బాధితుడు వాపోయాడు. ఏటీఎం కార్డు మార్చి మోసం చేసిన అపరిచిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.